క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: చెట్ల కొమ్మల తొలగింపు తదితర పనుల నిమిత్తం గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ బుధవారం ప్రకటించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఓల్డ్ బొమ్మూరు, మురళీకొండ, సోమనవారి తోట, జీపీఆర్ రోడ్, ఏఎంజీ కళాశాల వెనుక ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ఢిల్లీ సదస్సుకు ఆహ్వానం


మల్లేశ్వరరావు

కంబాలచెరువు: స్థానిక లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లేశ్వరరావుకు అరుదైన గౌరవం లభించింది. పాఠశాల లీడర్‌షిప్‌లో ప్రామాణిక నమూనాగా ఉండేలా వినూత్న ఆలోచనలను అందజేసేందుకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (న్యూపా) న్యూ ఢిల్లీలో ఈ నెల10 వరకూ ఏర్పాటు చేసిన వర్క్ షాప్‌లో మల్లేశ్వరరావు పాల్గొనున్నారు. ఆ వివరాలను ఆయన బుధవారం తెలిపారు. ఉన్నత పాఠశాల నిర్వహణలో కొన్ని ప్రత్యేక సవాళ్లను ఎలా అధిగమించాలనే అంశంపై న్యూఢిల్లీలో జరిగే సదస్సులో తాను మాట్లాడతానన్నారు. ఆయన్ని జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె.వాసుదేవ రావు, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, ఎంఈఓ- 2 రమారజిని తదితరులు అభినదించారు.

విజేతలకు అభినందన


రంగోత్సవ్ పోటీల్లో విజేతలను అభినందిస్తున్న హెచ్ఎం బత్తిన రాజేశ్వరి

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో నిర్వహించిన జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీల్లో శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థినిలు బి.అక్షయ దీపిక క్విజ్ విభాగం, జి.లలిత దేవి స్లోగన్ రైటింగ్‌లో ప్రథమ స్థానం సాధించారని ప్రధానోపాధ్యాయిని బత్తిన రాజేశ్వరి తెలిపారు. ఎస్.ప్రమీలాదేవి (8వ తరగతి) చేతిరాత విభాగంలో ద్వితీయ, ఐ.జగదేశ్వరి తృతీయ బహుమతి సాధించారన్నారు. విజేతలను బుధవారం హెచ్ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు డి.రాముడు, సర్వేశ్వరరావు, ఆర్.ప్రసాద్, జీవనజ్యోతి, ఉమారాణి అభినందించారు.

బొమ్మూరు మాజీ సర్పంచ్ మృతి


భాస్కరరావు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామ మాజీ సర్పంచ్ మద్దిపోటి భాస్కర రావు (86) మంగళవారం మృతి చెందారు. ఆయన 1960, 1965లోనూ రెండు సార్లు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. రెండు సార్లు ఆరు నెలల్లోపే సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి పదవికి రాజీనామా చేయడం జరిగింది. భాస్కరరావు తండ్రి మద్దిపోటి రామచంద్రరావు బొమ్మూరు గ్రామ పంచాయతీకి మొట్టమొదటి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. భాస్కరరావు మృతి పట్ల మాజీ సర్పంచ్‌లు మద్దిపోటి శంభాజీ రావు, మత్సేటి ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ కామిని ప్రసాద్‌చౌదరి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ


ఆంజనేయులు చిత్రపటం వద్ద గూడూరి శ్రీనివాస్, మార్గాని నాగేశ్వరరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇన్నీస్‌పేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత గేడి అన్నపూర్ణరాజును, అతని కుటుంబ సభ్యులను బుధవారం వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఉభయ రాష్ట్రాల బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు పరామర్శించారు. గేడి అన్నపూర్ణరాజు తండ్రి ఆంజనేయులు ఇటీవల మృతి చెందారు. దీంతో ఆంజనేయులు చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్నీసుపేట బ్యాంకు డైరెక్టర్ అందనాపల్లి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు బిల్డర్ చిన్న, నందం స్వామి, దుంగా సురేష్ తదితరులు ఉన్నారు.

మసిపూసి... మాయచేసి...

- కమిషనర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులు
- సాయినగర్ పార్కుపై నీలినీడలు
- నెలల తరబడి మూతపడిన వైనం


సాయినగర్ మెయిన్ రోడ్‌లో తెరుచుకోని పార్కు తాళం


ఆహ్లాదానికి తాళం!

డిసెంబరు 30న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనం

రాజమహేంద్రవరం సిటీ: సమస్య ఒకచోట అయితే... కమిషనర్‌ను ఇంకోచోటకు తీసుకెళ్లి అధికారులు పక్కదారి పట్టించిన వైనమిది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపల్ పార్కులను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు అవసరమైన చర్యలు చేపడతామని ఇటీవల కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు ఇచ్చినా అది కార్యరూపం దాల్చడం లేదు. అది ఎందుకంటే.. స్థానిక పదో డివిజన్ సాయినగర్ మెయిన్ రోడ్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపల్ పార్కు మూడు నెలలుగా మూతబడినా అధికారుల నిర్లక్ష్యంతో తెరుచుకోవడం లేదు. నిత్యం ప్రజలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదాన్ని పంచాల్సిన ఈ పార్క్ చెత్తా చెదారంతో నిండిపోయింది. కనీసం కాలు పెట్టడానికి సైతం అవకాశం లేకుండా పోయింది. దీనిపై గత నెల 30న 'ఆహ్లాదానికి తాళం' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై కమిషనర్ కేతన్ గార్గ్ తక్షణమే స్పందించారు. అదేరోజు నగరంలో పార్కులను పరిశీలించేందుకు ఆయన తనిఖీలు చేపట్టారు.

తప్పుదారి పట్టించి.. ఆపై వదిలేసి

'ఆహ్లాదానికి తాళం' అనే కథనానికి స్పందించిన కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు 10వ డివిజన్ సాయినగర్‌లో పర్యటించారు. అయితే మూడు నెలలుగా మూతపడిన పార్కులో వ్యర్థాలు పేరుకుపోవడంతో సంబంధిత ఉద్యాన అధికారులు కమిషనర్‌ను తప్పుదారి పట్టించారు. సాయినగర్ మెయిన్‌రోడ్‌లో ఉన్న పార్కును చూపించాల్సిన అధికారులు దానికి కూతవేటు దూరంలో ద్వారకానగర్ మున్సిపల్ పార్కును పరిశీలించేందుకు తీసుకు వెళ్లారు. ఆ పార్కును పరిశీలించిన కమిషనర్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా పార్కులను అందుబాటులో ఉంచుతామంటూ ప్రకటించారు. అయితే ఇప్పటికీ సాయినగర్ పార్కు వైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల స్థానికులు విస్తుపోతున్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఈ పార్కును నిత్యం సామాజిక సేవలో మమేకమయ్యే రాజమహేంద్రవరం లయన్స్ క్లబ్ నిర్వహించేందుకు దత్తత తీసుకుంది. ఈ పార్కు ప్రజలకు అందుబాటులో లేకుండా తాళం వేసి ఉన్నా దానిని శుభ్రపరచాలని లయన్స్ క్లబ్‌ను ఆదేశించాల్సిన అధికారులు మౌనంగా ఉండటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్క్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ఉపయోగపడకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. లయన్స్ క్లబ్ నిర్వాహకులు ఈ పార్కుకు రెండు వైపులా గేట్లకు తాళాలు వేసి తెరవకపోవడంతో, స్థానికులు ఎక్కడకు వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో 50 డివిజన్లలో 45 పార్కులను ఏర్పాటు చేశారు.

ఇందులో 36 పార్కులను నగరపాలక సంస్థ నిర్వహిస్తుంది. లయన్స్, రోటరీ, వాకర్స్ క్లబ్‌లు ఒకొక్కటి చొప్పున నిర్వహించేందుకు దత్తత తీసుకున్నాయి. మిగిలిన 6 పార్కులను గ్రీన్ గ్రాస్ ఏజెన్సీకి నిర్వహణకు అప్పగించారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పార్కులు నిర్వహణ సక్రమంగా ఉన్నప్పటికీ, స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పార్కు మూసి వేసి ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా కమిషనర్ కేతన్ గార్గ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పార్కును ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాల నిర్వహణపై తనిఖీ


విద్యపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు తదితరులు

కడియం: స్థానిక ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమలుపై రెండు రోజులు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా మిడ్ డే మీల్ అమలు, బియ్యం, గుడ్లు, చిక్కీలు, రాగిజావ తదితర వాటికి చెందిన రికార్డులను తనిఖీ చేశారు. అలాగే ఆర్వో ప్లాంట్, తరగతి గదులు, టాయిలెట్స్ శుభ్రత అంశాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సామాజిక తనిఖీ డీఆర్పీలు ఆర్.నాగేశ్వరరావు, కొమ్మర సూర్యప్రకాష్‌లు రికార్డులన్నీ పరిశీలించి, ఆరో ప్లాంట్‌ను మెరుగుపరచాలన్నారు. విద్యార్థులు శనివారం మెనూ మార్చాలని వారి దృష్టికి తీసుకువచ్చిన సంగతిని తెలియజేశారు. మొదటి రోజు రికార్డ్సను, రెండో రోజు పేరెంట్స్ మీట్, గ్రామంలో చదువుపై ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు టి.సత్యనారాయణ, ఎస్ఎంసీ అధ్యక్షురాలు గారపాటి సత్య, ఉపాధ్యాయ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, బి.సువర్ణవేణి, డేవిడ్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా తిరువాభరణ మహోత్సవం

వెల్లడించిన ధర్మశాస్తా ఆధ్యాత్మిక కేంద్రం ట్రస్టీలు


తిరువాభరణ మహోత్సవ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి, తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా స్థానిక గౌతమ ఘాట్ రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయానికి తిరువాభరణ మహోత్సవ ఊరేగింపును సంక్రాంతి రోజున నిర్వహిస్తామని శ్రీధర్మశాస్తా ఆధ్యాత్మిక కేంద్రం వ్యవస్థాపకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఆలయ ట్రస్టీలు చల్లా శంకర్రావు, పాలసానపల్లి హనుమంతరావు, మంతెన కేశవరాజు తెలిపారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2011 మార్చి 20న అయ్యప్ప స్వామి ఆలయం ప్రారంభించామని, ప్రతి రోజూ కేరళ సంప్రదాయం ప్రకారం పూజలు, ప్రతి ఏడాది తిరువాభరణ ఉత్సవం నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా ఆలయంలో అన్నదానం చేస్తున్నామని, దసరా రోజున ప్రారంభమైన అన్నదానం విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. అయ్యప్ప స్వాములు, భవాని, శివ భక్తులు వెరసి లక్షా 20 వేల మందికి ఈ ఏడాది భోజనం అందించినట్లు వివరించారు. ఉదయం గణపతి పూజ మొదలు రాత్రి వరకూ అన్ని రకాల సేవలు స్వామివారికి కొనసాగుతున్నాయని తెలిపారు. తిరువాభరణ మహోత్సవానికి ఏటా గరుడ పక్షులు వస్తున్నాయన్నారు. ఈ నెల 14న సంక్రాంతి రోజున తిరువాభరణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. ముందుగా జక్కంపూడి రామ్మోహనరావు స్వగృహంలో తిరువాభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మధ్యాహ్నం 2.15 గంటలకు సీతంపేటలోని అరిగెల బాబూనాగేంద్ర ప్రసాద్ నివాసం నుంచి శ్రీఅయ్యప్పస్వామి తిరువాభరణాలను, అమ్మవారి ఆభరణాలను కేరళ నృత్యాలతో ఊరేగింపుగా తీసుకు వస్తారన్నారు. ఈ ఊరేగింపు సీతంపేట, ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీస్, కంబాలచెరువు, దేవీచౌక్, లక్ష్మీవారపుపేట, కోటగుమ్మం మెయిన్ రోడ్, డీలక్స్ సెంటర్, టి.నగర్ విశ్వేశ్వరస్వామి గుడి మీదుగా శ్రీఅయ్యప్ప స్వామి ఆలయానికి చేరుతుందన్నారు. సాయంత్రం 6.15 గంటలకు తిరువాభరణాలను స్వామికి అలంకరిస్తారని, 6.45 గంటలకు శ్రీఅయ్యప్ప స్వామివారి మకరజ్యోతి దర్శనం ఉంటుందని తెలిపారు. రాత్రి 10 గంటలకు పవళింపు సేవ, ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సమావేశంలో ఆలయ ట్రస్టీలు యిమ్మంది మోహనరావు, దవులూరి రామకృష్ణ, గాదె చలపతి గురుస్వామి, బళ్ల సత్యనారాయణ, ఇసుకపల్లి సుబ్రహ్మణ్యం, అరిగెల బాబు నాగేంద్రప్రసాద్, పిచ్చుక సత్యనారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి ఆస్తుల పరిరక్షణకు చర్యలు


విద్యార్థులకు నగదు పురస్కారం అందిస్తున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు

సీటీఆర్ఐ: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టి, ఎస్‌కేవీటీ విద్యా సంస్థలకు పూర్వ వైభవం తీసుకువస్తామని ప్రముఖులు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ విద్యా సంస్థల వ్యవస్థాపకులు, విద్యాదాత మేడూరి సత్యనారాయణ జయంతి వేడుకలను బుధవారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించారు. మేడూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హాజరయ్యారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఆదాయ పన్ను శాఖ అధికారి మేడిశెట్టి తిరుమల కుమార్, అధ్యక్షురాలు మేడూరి కుమార్తె మారిశెట్టి కృష్ణకుమారి, కార్యదర్శి సానబోయిన రామారావు తదితరులు కందుకూరి వీరేశలింగం విగ్రహానికి, మేడూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేడిశెట్టి తిరుమల కుమార్ మాట్లాడుతూ ఆనందా గార్డెన్స్‌లోని కందుకూరి సమాధుల ప్రదేశాన్ని దర్శనీయ కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. డాక్టర్ అనుసూరి పద్మలత మాట్లాడుతూ ఎంతోమంది విద్యావేత్తలు, టీచర్లు, నాయకులను తయారుచేసిన మేడూరి సత్యనారాయణ మహోన్నతమైన వ్యక్తిత్వం కలిగిన వారని కొనియాడారు. కార్యక్రమంలో చల్లా శంకరరావు, ఎల్‌వీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మేడూరి ఫౌండేషన్ తరఫున వీటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేశారు.

ముందే వచ్చిన సంక్రాంతి


భోగి మంట వద్ద సందడి చేస్తున్న డైట్ ఛాత్రోపాధ్యాయినిలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో బుధవారం సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా ఛాత్రోపాధ్యాయినిలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ సంవత్సర ఛాత్రోపాధ్యాయినుల్లో ప్రథమ స్థానాన్ని మృదుల టీమ్, ద్వితీయ స్థానాన్ని ఉషా భార్గవి టీమ్, తృతీయ స్థానాన్ని సృజన టీమ్ కైవసం చేసుకున్నాయి. ద్వితీయ సంవత్సర ఛాత్రోపాధ్యాయినిల్లో రేఖా టీమ్ ప్రథమ స్థానాన్ని, జస్వంత్ సూర్య టీమ్ ద్వితీయ స్థానాన్ని, శ్రీలక్ష్మి టీమ్ తృతీయ స్థానాన్ని దక్కించుకున్నాయి. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సర ఛాత్రోపాధ్యాయులు కూడా పాల్గొని అందమైన ముగ్గులను ప్రదర్శించి జెండర్ సమానత్వాన్ని చాటుకోవడం విశేషమని అందరూ కొనియాడారు. తదనంతరం డైట్‌లో భోగి మంటను వేసి దాని చుట్టూ తిరుగుతూ కోలాటంతో పాటు కాకుండా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ వేడుకలు మన సంస్కృతీ సంప్రదాయాలను ఇనుమడింప చేస్తాయని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నగర నూతన కమిటీ ఎన్నిక

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ నగర మహాసభ జరిగింది. దీనికి ఎం.జోసెఫ్ అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ రాజమహేంద్రవరం నగరంలో అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేసి విజయం సాధించిందని చెప్పారు. ముఖ్యంగా కందుకూరి విద్యా సంస్థలు ప్రభుత్వంలో విలీనం చేయడం, జూనియర్ కళాశాల కో-ఎడ్యుకేషన్‌గా నడపాలని, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలలో పాఠ్య పుస్తకాలు ఇవ్వటం, మధ్యాహ్న భోజనం ప్రారంభించడం ఎస్ఎఫ్ఐ చేసిన ఉద్యమాలతోనే సాధించుకున్నామన్నారు. నూతన విద్యా విధానాన్ని రద్దు చెయ్యాలని, హనర్స్ డిగ్రీని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయ్యాలని, హాస్టల్ మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ మహాసభలో నూతన కమిటీని 17 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.జోసెఫ్, కె.జ్యోతిర్మయి నూతన కార్యదర్శి వర్గంగా కనక, దుర్గ, సాహితీ, సురేష్, చైతన్య, కమిటీ సభ్యులుగా హేమంత్, కార్తిక్, మేఘన, లహరి, శివ, శివబాలాజీ, తేజ, మధు, మౌళి, సాయి ఎన్నికయ్యారు. నూతన కమిటీని డీవైఎఫ్ఐ నాయకుడు రాజేష్ అభినందించారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని మాట్లాడాలి


మోకాళ్లపై నిలుచుని చిప్ప పట్టుకుని వినూత్న నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం) : విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడాలని, ప్లాంట్ అమ్మకాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. బుధవారం విశాఖ పర్యటనకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వచ్చిన నేపథ్యంలో విభజన హామీలు చేయని మోదీ గో బ్యాక్ అంటూ స్థానిక జాంపేట గాంధీ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలుచుని చిప్ప పట్టుకుని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వడం లేదన్నారు. పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడవనివ్వడంలేదన్నారు. కార్మికులకు, ఉద్యోగులకు జీతాలివ్వడంలేదన్నారు. లక్షమందికి ఉపాధి కల్పిస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నట్టేట ముంచుతూ, నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ ప్రైవేట్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ఆగమేఘాల మీద చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. ఇటీవల ఢిల్లీకి లో ప్రధానితో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ ఉక్కు కోసం కాకుండా, మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు ఇనుప ఖనిజం అంతరాయం లేకుండా సరఫరా చేయాలని, ప్లాంట్ ఏర్పాటుకు అన్ని అనుమతులు త్వరగా అందేలా చర్యలు చేపట్టాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు నగర కార్యదర్శి వి కొండలరావు, జట్ల సంఘం ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పి లావణ్య పాల్గొన్నారు.

అలయన్స్ సాధన క్లబ్ సేవలు అభినందనీయం


బొమ్మూరు దుర్గమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన బెంచీలను ప్రారంభిస్తున్న వనుం శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: నగర అలయన్స్ సాధన క్లబ్ సభ్యులు చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని క్లబ్ జిల్లా గవర్నర్ వనుం శ్రీనివాసరావు అన్నారు. బుధవారం అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ జిల్లా 106లోని రాజమహేంద్రవరం అలయన్స్ సాధన క్లబ్ ప్రెసిడెంట్ ముదునూరు వాణిశ్రీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అధికారిక పర్యటనలో భాగంగా జిల్లా గవర్నర్ వనుం శ్రీనివాసరావు బొమ్మూరు రాఘవేంద్ర నగర్‌కాలనీ హైవేపై ఉన్న దుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను ప్రారంభించారు. కస్తూరిబా ఓల్డ్ ఏజ్ హోమ్‌లో మహిళలకు చీరల పంపిణీ, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. బొమ్మూరు బాలాజీపేటలో క్లబ్ తరఫున నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణా తరగతుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. అనంతరం ఫీడ్ ది హంగార్‌లో భాగంగా ప్రతి బుధవారం గోదావరి నది ఒడ్డున నిరాశ్రయులైన వారికి అన్నదానం చేసే కార్యక్రమాన్ని వనుం శ్రీనివాసరావు ప్రారంభించారు. క్లబ్ ప్రెసిడెంట్ ముదునూరు వాణిశ్రీ, ఇంటర్నేషనల్ కమిటీ చైర్‌పర్సన్ కొయ్యాన కుమారి, రీజినల్ చైర్ పర్సన్ గొందేసి మాధవీలత, జోన్ చైర్‌పర్సన్ ప్రసన్నలక్ష్మి, క్లబ్ సెక్రటరీ రాజశ్రీ, క్లబ్ ట్రెజరర్ శారద తదితరులు పాల్గొన్నారు.

ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణతో సాధికారత


నగరంలో పర్యటిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణతో సాధికారత సాధించే దిశగా ప్రణాళిక రూపొందించాలని శానిటేషన్ సిబ్బందికి కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం నగరంలో డంపింగ్ యార్డు, ఎండ్రో యూనిట్, లెగసీ వ్యర్థాలు, కన్‌స్ట్రక్షన్ - డిమోలిషన్ ప్లాంట్, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్లు తదితరాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డు వద్ద ఎంట్రన్స్‌తో పాటు అన్ని కేంద్రాల వద్ద కూడా బోర్డులు పెట్టాలని ఆదేశించారు. విండ్రో మెషీన్ ఉన్న షెడ్ చుట్టూ గ్రీన్ మేట్ ఏర్పాటు చేయాలన్నారు. తడి చెత్తను ప్రోసెస్ చేసే ప్లాంట్‌కు చెత్తను తీసుకెళ్లి వాహనాలకు అడ్డం లేకుండా వేరేదారిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం చెత్తను వేస్తున్న డంప్ యార్డును శానిటరీ ల్యాండ్ ఫిల్ చేసేందుకు తగిన అంచనాలు తయారు చేయాలన్నారు. అన్ని ప్లాంట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. హుకుంపేట వద్ద సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను వెంటనే ఉపయోగంలోకి తీసుకురావాలని ఆదేశాలు జారీ చేశారు. మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్ సమీపంలో నిర్మించిన గుడి అదనపు కట్టడాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనధికార కట్టడాలు నిర్మించే వరకూ ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించిన ప్లానింగ్ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్‌కు సూచించారు. రాబోయే స్వచ్ఛ సర్వేక్షణ్-2025 లో మొదటి 10 స్థానాల్లో నగరం ఉండేలా ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టాలని అన్నారు. ఈ సందర్శనలో సూపరింటెండింగ్ ఇంజినీర్ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ కోటయ్య, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ.వినూత్న, డిప్యూటీ సిటీ ప్లానర్ బాలాజీ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎంవీకే మాధవి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.సత్యనారాయణ, విరూపాక్షరావు తదితరులు పాల్గొన్నారు.

ముచ్చటగా తెలుగు మహాసభలు

రాజానగరం: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో ప్రారంభమైన ప్రపంచ తెలుగు మహాసభలను చూస్తుంటే ఎంతో ముచ్చట కలుగుతుందని మాజీ ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. బుధవారం జీజీయూలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సాధారణంగా ఇటువంటి సభలలో 60 ఏళ్ల పైబడిన వారే ఎక్కువ కనిపిస్తుంటారని, కానీ ఇక్కడ అందుకు భిన్నంగా ఎక్కువగా యువతే ఉండడం అభినందనీయమన్నారు. మాతృభాష పట్ల యువతకు ఆదరణ, అభిమానాలు ఉన్నాయనే విషయం ఈ విధంగా తేటతెల్లం అవుతుందన్నారు. పెద్దలు కూడా ఈ విషయమై మరింత శ్రద్ధ తీసుకుని, ఇంట్లోనే కాదు సభలు, సమావేశాల్లోనూ మాతృభాషలో మాట్లాడే విధంగా తోడ్పాటు ఇవ్వాలని సూచించారు. తెలుగు భాష పట్ల తనకు ఉన్న ప్రేమతోనే గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ చాన్సలర్, సభాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. గత ఏడాది తిరుమల శ్రీవేంకటేశ్వరుని నమూనా ఆలయంతో శ్రీనివాసుని దర్శించుకునే అవకాశం కల్పిస్తే, ఈసారి కృత్రిమ మేథ, సాంకేతికతను ఉపయోగించి అయోధ్య బాలరాముని నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రముఖ తబలా వాయిద్య కారిణి అనురాధా పాల్‌తోపాటు పలువురిని విశిష్ట పురస్కారాలతో సత్కరించారు.

ఆక్రమణల తొలగింపుపై దృష్టి పెట్టాలి


రంగంపేట వద్ద ఏడీబీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

రంగంపేట: ఏడీబీ రోడ్డు అభివృద్ధిలో భాగంగా భూసేకరణ భూముల ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం ఆమె రంగంపేట మండల పరిధిలో జరుగుతున్న ఏడీబీ రోడ్డు అభివృద్ధి పనులను జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాయుడుతో కలసి ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకినాడ-రాజానగరం ప్రధాన రహదారి మార్గంలో ఏపీ రహదారుల, అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో చేపట్టిన పనులు పూర్తి చేయడంలో మరింత సమర్థవంతంగా పని చేయాలన్నారు.

కాకినాడ- తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన ప్రధాన రహదారి మార్గాన్ని సాధ్యమైనంత తొందరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు గురైన వాటిని గుర్తించి, అక్కడి నుంచి వారిని తరలించి, ఆయా నిర్మాణాలు తొలగించే విషయాల్లో హేతుబద్ధంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అనంతరం రంగంపేట మండలం ఎస్టీరాజాపురం, వడిశలేరు గ్రామాలకు చెందిన భూములను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్, ఆర్‌డీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీకాంత్, తహసీల్దార్లు లావణ్య, కోసు అనసూయ, డీటీ యు.రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.